ఆలయాల్లో శ్రావణమాస పూజలు

కడప కల్చరల్ : శ్రావణమాసం తొలి శనివారం సందర్భంగా కడప నగరంలోని పలు వైష్ణవాలయాల్లో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. తిరుమలేశుని తొలిగడపగా భావించే దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ సందర్భంగా దేవతామూర్తులకు ఉదయం విశేష పంచామృతాభిషేకం, అనంతరం కనుల పండువగా అలంకారం నిర్వహించారు. అనంతరం పల్లకీపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. తమ ఇళ్ల వద్దకే వచ్చిన దేవతామూర్తులను దర్శించుకున్న భక్తులు పూజలు చేశారు. అర్చకులు వారికి మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చకుడు తివిక్రమ్, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

– కడప నగర శివార్లలోని శ్రీ పాలకొండరాయస్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం దేవతామూర్తులకు అభిషేకం, పూల అలంకరణ చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిచ్చారు. అటవీశాఖ డివిజనల్ అధికారి సందీప్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో అర్చకులు యోగీశ్వర్‌లు ఆయనకు వేదాశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. పర్వతపాదం వద్దగల ఆర్చి సమీపంలో ఇందిరానగర్‌కు చెందిన బాలాజీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటూరి రామచంద్రారెడ్డి అన్నదానం చేశారు. భక్తుల ఆధ్వర్యంలో ఆలయంవద్ద కూడా భారీగా అన్నదానం నిర్వహించారు.

– నగరంలోని గడ్డిబజారులోగల శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి శనివారం పూజలను ఘనంగా నిర్వహించారు. స్థానిక భక్తులు విశేష సంఖ్యలో వచ్చి అలంకారమూర్తులైన శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామిలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

– కడప నగరంలోని అన్ని వైష్ణవాలయాలు, అంజనేయస్వామి ఆలయాలలో కూడా శ్రావణ మాసం తొలి శనివారం పూజలను ఘనంగా నిర్వహించారు.


విశేష అలంకారంలో శ్రీ పాలకొండ్రాయస్వామి


భక్తుల పూజలందుకున్న శ్రీలక్ష్మీదేవి


దేవునికడప ఆలయంలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు


పాలకొండరాయుడి ఆలయంలో స్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తజనం


దేవుని కడప ఆలయంలో భక్తుల రద్దీ

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో లక్ష్మినరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారు

పెండ్లిమర్రి: మండలంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహ స్వామి, లక్ష్మిదేవి అమ్మవారికి మొదటి శ్రావణ శనివారం సందర్భంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కల్యాణ వేడుక నిర్వహించారు. ముందుగా ఉదయం స్వామి వారికి గణపతిపూజ, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచేగాక జిల్లా వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులందరికీ ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.

ఉపాధ్యాయ సంక్షేమమే యూటీఎఫ్ లక్ష్యం

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సంక్షేమమే పరమావధిగా యూటీఎఫ్ పనిచేస్తోందని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తిచేసుకుని 51వ వసంతంలో అడుగిడుతున్న సందర్భంగా శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భావం నుండి నేటి వరకు ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే వైఖరిని కొనసాగిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు, సరెండర్ లీవ్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు సాధించడంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్యమేరి, నాయకులు వీరనారాయణ, విజయ చంద్రారెడ్డి, సుబ్బారావు, గురు మోహన్, ప్రకాష్ బాబు, దేవదత్తం, చెన్నయ్య, జానకిరామ్, శ్రీకాంత్, మాలే బాబు, శ్రీహరి, ఎల్లారావు, కిరణ్ బాబు, కరిముల్లా, బత్తుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పీఎం సూర్య ఘర్ బిజిలి యోజన వినియోగించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వం కోటి ఇళ్లకు పీఎం సూర్య ఘర్ బిజిలి యోజన పథకాన్ని అందిస్తున్న తరుణంలో ఆయా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి కోరారు. శనివారం కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలో కేజీ సోలార్ సిస్టమ్ అండ్ ఇన్‌స్టలేషన్ కార్యాలయాన్ని శశిభూషణ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా కరెంటు బిల్లుల నుంచి ఉపశమనం పొందాలని సూచించారు. కేజీ సోలార్ సిస్టమ్ మేనేజింగ్ పార్టనర్ గజ్జల రామకృష్ణారెడ్డి, రమణారెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మినారాయణ, టీడీపీ నాయకులు డాక్టర్ కృష్ణకిశోర్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, పద్మావతిభాయి పాల్గొన్నారు.

డీ మార్ట్ ఏర్పాటుపై చర్యలు చేపట్టాలి

కడప రూరల్ : కడప నగరంలో డీ మార్ట్ సూపర్ బజారు ఏర్పాటుతో వేలాది మంది జీవనోపాధికి ఆటంకంగా మారనున్న తరుణంలో అందుకు సంబంధించి తగిన చర్యలు చేపట్టాలని కడప సూపర్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, మాలేపాటి నాగరాజులు కోరారు. శనివారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రముఖ కార్పొరేట్ సంస్థ డీ మార్ట్ తమ వ్యాపార కార్యకలాపాల నిర్వహణ కోసం ఇటీవల కడప నగరంలో భూమి కొనుగోలుకు ఉపక్రమించిందన్నారు. ఇది మా అందరి వ్యాపార, వాణిజ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ అంశం 2500 కుటుంబాలను ప్రభావితం చేస్తుందన్నారు. అంతేకాకుండా స్థానికంగా తమ ఉత్పత్తులను సరఫరా చేసే తయారీదారులు, ఇండస్ట్రీలు, వ్యాపారులు, వారి ఉద్యోగులకు ఇబ్బందులు తప్పవన్నారు. ఇటీవల ప్రొద్దుటూరు పట్టణంలో డీ–మార్ట్ స్టోర్ ప్రభావంతో స్థానిక వ్యాపారాలను తీవ్ర ప్రభావితం చేసిందన్నారు. ఇటువంటి తరుణంలో డీ–మార్ట్ భూమి కొనుగోలు పట్ల జోక్యం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సూపర్ మార్కెట్ అసోసియేషన్ నాయకులు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

జనవాక్కు

కడప నగరంలోని రహమతీయ ఫంక్షన్ హాలులో 'వక్ఫ్ సవరణ బిల్లు-రాజ్యాంగ విరుద్ధం' అనే అంశంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ బిల్లు ముస్లిం సమాజానికి గొడ్డలి పెట్టు లాంటిదన్నారు.

– కడప వైఎస్ఆర్ సర్కిల్

వక్ఫ్ భూములను కాజేయాలని చూస్తోంది



కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒక మాట, అధికారంలో వచ్చిన తర్వాత మాట్లాడటం తగదు. కేంద్ర ప్రభుత్వం ఈరోజు సవరణ అనే పేరుతో వక్ఫ్ భూములను కాజేయాలని చూస్తోంది. ఈ బిల్లుకు ఆంధ్రప్రదేశ్ టీడీపీ ఎంపీలు మద్దతు ఇవ్వడం సరికాదు.

– షేక్ మక్బూల్ బాషా, ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి

ముస్లింల అభివృద్ధి కోసమే వక్ఫ్ భూములు



దేశంలోని ముస్లింల అభివృద్ధి కోసమే వక్ఫ్ భూములు ఇచ్చారు. దేశంలో ఆర్మీ, అటవీ శాఖ తర్వాత అత్యధికంగా ఆస్తి ఉన్నది వక్ఫ్ బోర్డుకు మాత్రమే. అది కూడా రైల్వే, బీఎస్ఎన్ఎల్ లాగా బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టాలన్న ఉద్దేశంతోనే ఈ సవరణ బిల్లు తీసుకొస్తున్నారు.

– మహమ్మద్ అలీఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు

సవరణ బిల్లును వ్యతిరేకించాలి



పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును దేశంలోని అన్ని పార్టీలు వ్యతిరేకించాలి. వక్ఫ్ భూములు కాజేయడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోంది. బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం వారి ఆస్తులను కట్టబెట్టడం కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

– రవిశంకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ

పోరాటాలకు సిద్ధపడతాం



వక్ఫ్ బోర్డు ఆస్తులను మోడీ ప్రభుత్వం కాజేయాలని చూస్తోంది. దీనిని లౌకిక ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలి. ఇందులో కొంత మంది దొంగనాటకాలు ఆడుతున్నారు. ఈ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అన్ని పార్టీలను కలుపుకొని పోరాటాలకు ముందుకు సాగుతాం.

– సయ్యద్ అహ్మద్ (బాబు భాయ్), ఎస్ఆర్సీ కన్వీనర్





కడప మార్కెట్ యార్డులో వేరుశనగ గింజలను తింటున్న పావురాళ్లు

ఆకలి పూట.. వెతుకులాట

ఆకలి ప్రతి జీవికి సహజం. పక్షులు గూడు విడిచి ఆహార వేటలో నిమగ్నమవుతాయి. సాయంత్రం వరకూ వివిధ ప్రాంతాలు తిరిగి తమ కడుపు నింపుకుంటాయి. ఈ క్రమంలో కపోతాల గుంపు ఆహారవేటలో అలా.. అలా తిరిగి కడప మార్కెట్ యార్డుకు వచ్చి వాలాయి. అక్కడ వేరుశనగ బస్తాలు విక్రయానికి తీసుకువచ్చారు. ఆ క్రమంలో కొన్ని కాయలు కిందపడి ఉన్నాయి. వాటిని ఆ పావురాలు కడుపునిండా ఆరగించాయి.

– కడప అగ్రికల్చర్

క్లుప్తంగా

విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న రైతు సంఘం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేరళలోని వయనాడ్ జిల్లాలో వరద బాధిత ప్రజలకు జరిగిన నష్టం పూడ్చలేనిదని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి తెలిపారు. శనివారం కడప నగరంలో రైతు బజార్, కోటిరెడ్డి సర్కిల్ పరిసర ప్రాంతాలలో ప్రజల నుంచి రూ.4015 విరాళాలను సేకరించారు. కేరళ రాష్ట్రానికి సంఘీభావంగా ఆర్థిక సహకారం అందజేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మోదీ ప్రభుత్వం కార్మిక వర్గం పట్ల అవలంబిస్తున్న విధానాల పైన చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా, ఉపాధ్యక్షురాలు మంజుల, జిల్లా కార్యదర్శి కే లింగన్న, నగర కార్యదర్శి మద్దిలేటి పాల్గొన్నారు.

జీఓ నంబర్ 84 ను రద్దుచేయాలి

కడప ఎడ్యుకేషన్: పురపాలక ఉపాధ్యాయులకు సంబంధించిన జీఓ నంబర్ 84ను రద్దు చేయాలని ఎస్టీయూ కడప నగర అధ్యక్షుడు సాధిక్ అలీ డిమాండ్ చేశారు. శనివారం విజయవాడ ఎస్టీయూ భవన్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన జీఓ నెంబర్ 84పైన రాష్ట్రంలోని మున్సిపాలిటీ, కార్పొరేషన్, గ్రేటర్ కార్పొరేషన్ ఉపాధ్యాయుల చర్చా వేదిక నిర్వహించారన్నారు. ఈ చర్చా వేదికలో ఎస్టీయూ రాష్ట్ర సంఘం జీఓ రద్దుకు ఏకగ్రీవంగా తీర్మానించిందని సాధిక్ అలీ తెలిపారు.

నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థలు సెలవు దినాల్లో కూడా పాఠశాలలను నిర్వహిస్తూ అటు విద్యార్థులను, ఇటు ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గద్దం రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ శనివారం అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు సెలవు, కానీ నారాయణ విద్యా సంస్థలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రం సెలవు ఇవ్వలేదన్నారు. జిల్లాలోని బద్వేల్, ప్రొద్దుటూరు, రైల్వేకోడూరు, రాయచోటి బ్రాంచ్‌లలో పని చేసే ఉపాధ్యాయులందరినీ కడప కేంద్రంగా శనివారం వర్క్‌షాప్ నిర్వహించారని ఆరోపించారు. జిల్లా విద్యా శాఖాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేలా బోధనలు


శిక్షణకు హాజరైన వివిధ కళాశాలల అధ్యాపకులతో ప్రిన్సిపాల్ సలీంబాషా

వైవీయూ: విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేలా బోధనలు చేయాలని కడప ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. కడప నగరంలోని ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని నోడల్ రీసోర్స్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సెల్ అండ్ సీక్ శిక్షణ కార్యక్రమం ఆదివారం కొనసాగింది. మూడోరోజు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠాలతో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే గురువులను బాగా అభిమానిస్తారన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా విద్యార్థుల్లో ప్రేరణ కలిగించాలని సూచించారు. విద్యార్థుల బలాలను తెలియజెప్పడంతో పాటు బలహీనతలను అధిగమించేలా తీర్చిదిద్దాలన్నారు. రీసోర్స్ పర్సన్ పి.వి. సుబ్బారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌లు డా. ప్రేమలత, షాజియాబేగం, రీసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ డా. ఎం.వి. రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇరువురికి గాయాలు

కడప అర్బన్: కడప నగరంలోని అప్సర సర్కిల్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మాసాపేటకు చెందిన ఉమామహేశ్వరరావు తన సొంతపనిమీద అప్సర సర్కిల్ వద్దకు వెళుతుండగా మధ్యలో పెట్రోల్ అయిపోయింది. దీంతో తన మోటార్‌సైకిల్‌ను పెట్రోల్ బంక్ వరకు తోసుకుని వెళుతుండగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సుఖవనం రాజు కెటిఎం బైక్‌పై వేగంగా వచ్చి మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. చికిత్సకోసం ఇరువురిని రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం సుఖవనం రాజును ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌక్ పోలీసులు తెలియజేశారు.

నేడు శిల్పారామంలో చేనేత ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు చేనేత వస్త్రాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ జి.నాగరాజారావు తెలిపారు. చేనేత వారోత్సవాల సందర్భంగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో ఈ ప్రదర్శన ఉంటుందని, అన్నిరకాల దుస్తులపై 30 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ స్టాల్స్‌లో పొందూరు ఖద్దరు షర్టింగ్ పంచెలు, బందరు కాటన్, మంగళగిరి నేత చీరలు, మాధవరం చీరలు, ఆంధ్రప్రదేశ్ నలుమూలల సొంత మగ్గాలపై తయారు చేసిన ఉత్పత్తులను తక్కువ ధరలకే విక్రయిస్తామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం శిల్పారామాన్ని సందర్శించి స్టాల్స్ ఏర్పాటును పర్యవేక్షించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కిలో గంజాయి స్వాధీనం

కడప అర్బన్: నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో తారకరామానగర్‌లో గంజాయిని విక్రయిస్తున్న కృష్ణవేణి అనే మహిళను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ తిమ్మయ్య తెలియజేశారు. ఆమె వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పాఠశాల ప్రశ్న పత్రాలతోనే ఎఫ్ ఏ -1 పరీక్షలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈనెల 24వ తేదీ నుండి జరగనున్న ఎఫ్ఏ–1 పరీక్షలు పాఠశాల స్థాయి ప్రశ్న పత్రాలు తోనే నిర్వహించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీలు సి వి ప్రసాద్ ,చంగల రెడ్డి, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర ,ఆలీ ఖాన్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల స్థాయిని బట్టి ప్రశ్నాపత్రాన్ని తయారు చేసే విధంగా విద్యాశాఖ అధికారులు అనుమతి ఇవ్వాలని కోరారు. వాట్సాప్ ప్రశ్నాపత్రాలకు స్వస్తి పలకాలని కోరారు. ముద్రణ ప్రశ్నా పత్రాలు సరఫరా చేయకపోవడం వల్ల గందరగోళం నెలకొందని తెలిపారు. అలాగే ఆగస్టు 17 నుంచి జరగనున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు మెయింటినెన్స్ ఫండ్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం జరిగిన కాంప్లెక్స్ సమావేశాలకు కనీస నిధులు కూడా మంజూరు కాలేదన్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సాయంత్రం వరకు ఉన్నందున స్టేషనరీ, అల్పాహారం, భోజనం ఖర్చులకు టీచర్‌కు రూ. 200 యూనిట్ ఉండే విధంగా నిధులు విడుదల చేయాలని కోరారు.

కృతజ్ఞతా యాత్రను జయప్రదం చేయాలి


కృతజ్ఞతా యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నేతలు

కడప రూరల్ : సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టే కృతజ్ఞతా యాత్రను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శివ తెలిపారు. ఈ యాత్రను ఎమ్మార్పీఎస్ శ్రేణులు జయప్రదం చేయాలన్నారు. ఈ మేరకు కృతజ్ఞతా యాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మునెయ్య, నారాయణ, రాములయ్య, ఓబులేశు, వెంకటరమణ, నాగేశ్వరరావు, బాబు పాల్గొన్నారు.

నేడు ప్రారంభోత్సవం

కడప ఎడ్యుకేషన్: నగరంలోని మాచుపల్లె రోడ్‌లోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల సమీపంలో ఎస్ ఏ క్యూ టెక్నాలజీస్ ఇన్‌స్టిట్యూట్‌ను ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అమీర్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. సేల్స్‌ఫోర్స్, ఏజ్యూర్, యూఐ పాత్, డిజిటల్ మార్కెటింగ్ తదితర వినూత్న సాఫ్ట్‌వేర్ కోర్సులతో జిల్లాలోనే తొలిసారిగా ఇలాంటి ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించనున్నామని ఆయన పేర్కొన్నారు. ఇకపై జిల్లా యువత చెన్నై, హైదారాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లకుండా కడపలోనే అధునాతన సాఫ్ట్‌వేర్ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. పూర్తి వివరాలకు 7093081073 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

దారికి స్థలం కేటాయించకుండా నిర్మాణం

కడప రూరల్: దారికి స్థలం ఇవ్వకుండా నిర్మాణం చేపట్టడంతో ఇబ్బందిగా ఉందని కడప నగరం తిలక్‌నగర్‌కు చెందిన స్థానికులు జయమ్మ, ప్రభావతి, నాగలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తామంతా దారి కోసం కొంత స్థలంను వదిలి ఇంటి నిర్మాణాలు చేపట్టామన్నారు. అయితే ఒకతను రోడ్డుకు కాసింతైనా స్థలం వదలకుండా నిర్మాణాలు చేపట్టడం ఇబ్బందిగా ఉందని తెలిపారు. అధికారులు ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో భాగ్యవతి, శ్రీదేవి పాల్గొన్నారు.